క్లుప్తంగా

ఘనంగా గాయత్రి మహాయజ్ఞం



గాయత్రి మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో గురువారం 24 కుండీల గాయత్రి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. హరిద్వార్ నుంచి గాయత్రి ట్రస్ట్ నుంచి వచ్చిన స్వామిజీలు శివాజీరావు, సందీప్ ఆధ్వర్యంలో యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామికి సారె



రమా సత్యనారాయణ స్వామికి సారె తీసుకువస్తున్న కోలాటం బ్యాచ్ ఆడపడుచులు

వీరఘట్టం: స్థానిక రమా సత్యనారాయణ స్వామి వారికి వీరఘట్టంకు చెందిన కోలాటం గ్రూపు ఆడపడుచులు కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 30 రకాల వంటకాలతో సారెను గురువారం సమర్పించారు. వీరంతా ప్రత్యేకాలంకరణలతో మేళతాళాలతో పట్టణవీధుల గుండా సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. అర్చకులు సర్వాజోశ్యుల సతీష్ శర్మ వీరికి ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసారు. అనంతరం వీరంత స్వామి వారి ముందు కోలాట ప్రదర్శలు ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు.

నేడు రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కురుపాం: మండలంలోని వలసబల్లేరు పంచాయతీ చాపరాయిగూడ గ్రామానికి నూతన రహదారి నిర్మాణ పనులకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణితో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ కె.గీతాంజలి సూచించారు. మండలంలోని సోమగండిలో ఓ గర్భిణి ఇంటికి స్వయంగా ఆమె వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమెకు సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ద్వారా అందుతున్న ఆహారం గూర్చి అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రికార్డులు పరిశీలించారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధితురాలికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ ప్రతినిధి

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్లపాడులో యజ్జు పైడిందొర ఇటీవల అకాల మరణం పొందాడు. దీంతో అతని కుటుంబానికి ఆదుకునేందుకు రూ.10 వేల వైఎస్సార్ బీమాను తక్షణ సాయం కింద సర్పంచ్ ప్రతినిధి ఎం.భవానీ చంద్రమౌళీశ్వరరావు గురువారం అందజేసారు. మిగిలిన డబ్బులు త్వరలో ప్రభుత్వం అందజేస్తుందని ఆయన తెలిపారు.

ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు చర్యలు



విద్యార్థులను బస్సులెక్కిస్తున్న పోలీసులు

భామిని: మండల కేంద్రంలో విద్యార్థుల రద్దీతో బస్సులు ఎక్కుతున్నప్పుడు జరుగుతున్న వరుస ప్రమాదాల నివారణకు పోలీసులు ఉపక్రమించారు. గురువారం భామిని మండల కేంద్రంలో బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు పర్యటించి విద్యార్థులు ప్రమాదాలకు గురువతున్న ప్రదేశాన్ని గుర్తించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసారు.

నేటి సామాజిక సాధికార యాత్రకు తరలిరండి

- ముమ్మరంగా ఏర్పాట్లు
- పార్టీ నాయకులకు దిశా నిర్దేశం
- ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



పాలకొండ: సాధికార యాత్రకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మద్దతు తెలిపిన మెప్మా సిబ్బంది

పాలకొండ: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార యాత్ర పాలకొండలో శుక్రవారం జరగనుంది. యాత్ర విజయవంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఏర్పాట్లను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం పరిశీలించారు. నియోజకవర్గంలోని నాయకులతో గురువారం సమావేశమై యాత్ర విజయవంతానికి దిశా నిర్దేశం చేశారు. యాత్రలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నాలుగున్నరేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు చేసిన మేలును నేతలు వివరించనున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుంటే కొన్ని దుష్ట శక్తులు అడ్డుకోవడాన్ని ప్రజలకు ఈ యాత్ర ద్వారా వివరించనున్నారు. ఇదిలా ఉండగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న మహిళలు గురువారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కలిసి సాధికార యాత్ర విజయవంతం చేసేందుకు తమ వంతు మద్దతు తెలిపారు. పట్టణంలోని పార్టీ నాయకులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సమావేశమై యాత్ర విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు.

భామినిలో...

భామిని: పాలకొండలో శుక్రవారం జరగనున్న సామాజిక సాధికార యాత్రకు ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు పిలుపునిచ్చారు. వీరు గురువారం వేర్వేరు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులను యాత్రకు సమాయత్తం చేసారు.



భామిని: బాలేరు సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్

విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని పెంచాలి



లిప్ శిక్షణలో మాట్లాడుతున్న హెచ్‌ఎం అప్పారావు

వీరఘట్టం: ప్రతీ విద్యార్థిలో అభ్యసన స్థాయిని పెంచాలని ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు సూచించారు. తలవరం, వీరఘట్టం బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాం) కార్యక్రమంలో వీరు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ధారాళంగా చదవడం, చదివిన అంశాల పట్ల అవగాహన కలిగి ఉండటమే ఈ అభ్యసనాభివృద్ధి కార్యక్రమం ఆవశ్యకత అని తెలిపారు. కార్యక్రమంలో వీరఘట్టం, పాలకొండ మండలాలకు చెందిన సోషల్, గణితం, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈఓగా కృష్ణమూర్తి



కృష్ణమూర్తికి అభినందలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

పాలకొండ రూరల్: మండల విద్యాశాఖాధికారి–1గా విధులు నిర్వహిస్తున్న పి.కృష్ణమూర్తికి డిప్యూటీ ఈఓగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ విద్యా శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు గురువారం ఆయన డిప్యూటీ ఈఓగా పాలకొండలో బాధ్యతలను చేపట్టారు. ఎంఈఓ కె.సోంబాబు, మండల పరిధిలో ఉపాధ్యాయులు, ఆయా సంఘ నాయకులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది కృష్ణమూర్తికి అభినందనలు తెలియజేశారు.

ఊపందుకున్న రోడ్డు విస్తరణ పనులు



వీరఘట్టం ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న డివైడర్లు

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు ఊపందుకున్నాయి. రూ.5.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల్లో ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్స్ వేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డివైడర్స్ వేసి అనంతరం బీటీ వేస్తామని జేఈ జగన్‌మోహన్‌రాజు తెలిపారు. డిసెంబర్ నెలాఖరుకు రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. 2024 కొత్త సంవత్సరంలో వీరఘట్టం పట్టణ ప్రజలకు కొత్త రోడ్డును అందిస్తామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు త్వరగా చేపట్టాలని కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌కు జేఈ సూచించారు. ప్రస్తుతం అంబేడ్కర్ జంక్షన్, గ్రోమోర్ సెంటర్ల వద్ద కాయగూరలు అమ్మేవారు రోడ్డు పనులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, రోడ్డుకు అడ్డంగా నిలబడి కాయగూరలు విక్రయించడం వల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుండడంతో పనులు చేపట్టలేకపోతున్నామని కాంట్రాక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు కలుగజేసుకుని పనులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయండి



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ తదితరులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చే క్రమంలో ఇళ్ల స్థలాలను మంజూరు చేయడం గొప్ప విషయమని అన్నవరం సర్పంచ్ గవర రాజశేఖర్ అన్నారు. స్థానిక పంచాయతీ కేంద్రంలో గృహ లబ్ధిదారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, నిర్మాణానికి దశల వారీగా మంజూరు చేస్తున్న బిల్లులు పొందే విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



మండలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో సర్పంచ్ హైమావతిని సన్మానిస్తున్న డీపీఓ, అధికారులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పథకాల ప్రయోజనం కల్పించడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని మండ, బీరుపాడు గ్రామ పంచాయతీల్లో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు పర్యవేక్షణలో యాత్ర గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల సమాచారం అందిస్తూ, ప్రజలకు అవసరమైన పథకాల్లో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రతిజ్ఞ చేశారు. ఉత్తమ సేవలందిస్తున్న వారితో పాటు సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ, కళాజాత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్ల అందజేత

పాలకొండ రూరల్: పనుకువలస గ్రామంలో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. సత్యసాయి మందిరం వద్ద విశ్రాంతి ఉపాధ్యాయుడు కోట మోహనరావు, మాజీ జెడ్పీటీసీ ఎస్.దామోదరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కోట అజయ్‌బాబు తదితరులు దుప్పట్లు, వస్త్రాలు అందజేశారు.

సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జనార్దన్

గరుగుబిల్లి: రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల తహసీల్దార్ జీవీ జనార్దన్, ఉప తహసీల్దార్ ఎల్.రమణారావు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ నెల 30వ తేదీలోగా సరుకులను విడిపించాలన్నారు. నిర్దేశించిన సమయానికి డీడీలు చెల్లించాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఉదయం 6గంటల నుంచి సరుకుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. సిగ్నల్ సమస్య వస్తే సిగ్నల్ ఉన్న ప్రాంతాల్లో సరుకులను లబ్ధిదారులకు అందించాలన్నారు. డిసెంబర్ నెలలో లబ్ధిదారులకు కంది పప్పును సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి

కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా దేవాలయాలు భక్తులతో గురువారం కిక్కిరిసిపోయాయి. ఏకాదశి పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దీపారాధన చేసారు. – సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: సత్యనారాయణస్వామి ఆలయంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు



జియ్యమ్మవలస: బిత్రపాడులో జరిగిన పూజల్లో పాల్గొన్న మహిళలు



భామిని: నేరడి ఆలయంలో దీపోత్సవం చేస్తున్న మహిళా భక్తులు



భామిని: బత్తిలిలో భక్తుల పూజలందుకొంటున్న రాధాకృష్ణ బృందావన స్వామి



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట నీలమ్మతల్లి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

సాయి మార్గం అనుసరణీయం

పాలకొండ రూరల్:

భగవాన్ శ్రీ సత్యసాయి చూపిన ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకొని స్థానిక సాయి మందిరంలో విశేష పూజలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు వస్త్రదానం చేసారు. సాయి సేవా సమితి కన్వీనర్ ఆర్.కిశోర్ నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పాలకొండ రూరల్: సత్యసాయి మందిరంలో కేక్‌ను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



సీతంపేట: నారాయణసేవ చేస్తున్న సమితి సభ్యులు

సీతంపేటలో..

సీతంపేట: సీతంపేటలో ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు నిర్వహించారు. వేకువ జామున ఓంకార సుప్రభాతం, మహిళలు కలశాలతో నగర సంకీర్తన చేశారు. ముఖ్య అతిథి హెచ్‌ఎం కె.సుబ్బారావు, జీసీసీ డీఎం సంధ్యారాణి సర్వమత పతాకా విష్కరణ చేశారు. పూర్వపు ఐటీడీఏ పీఓ సురేందర్, మాజీ ఎమ్మెల్యే సుగ్రీవులు ఆర్థిక సాయం అందించారు. దీంతో 16 మందికి అమృత కలశాలలో భాగంగా నిత్యావసర సరుకులతో పాటు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. దాదాపు 2 వేల మందికి నారాయణ సేవ చేశారు. సేవాసమితి అధ్యక్షుడు గొర్లె నరసింహులు, కన్వీనర్ పకీర్‌నాయుడు, సమితి సభ్యులు పాల్గొన్నారు.



వీరఘట్టం: సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న సాయిభక్తులు

వీరఘట్టంలో..

వీరఘట్టం: మండల వ్యాప్తంగా భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి గురువారం ఘనంగా జరిగింది. వీరఘట్టం ప్రధాన రహదారిలో సాయిబాబా చిత్రపటాన్ని భక్తులు పల్లకిలో ఊరేగించారు. మహా నారాయణ సేవ కార్యక్రమంలో 5వేల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేసారు. నడుకూరులో సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించి సుమారు 3వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు.

భామినిలో..

భామిని: సాలికిరి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు అందజేసారు. బత్తిలిలో ఏఎస్‌ఐ కాంతారావు చేతుల మీదుగా సర్వమత పతాకం ఆవిష్కరించారు. ఉప సర్పంచ్ వమ్మరవిల్లి రమేష్ జ్యోతి వెలిగించి ఉత్సవాలు నిర్వహించారు. మహిళలతో సాయి వ్రతాలు గావించారు. బాలేరులో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మేడిబోయిన శ్రీవేణి ఆధ్వర్యంలో మహిళలు కోలాటంతో బాబా తిరువీధి నిర్వహించారు.



భామిని: సాలికిరిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి



భామిని: బత్తిలిలో సాయి వ్రతాలు చేస్తున్న మహిళలు

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి



కొత్తూరులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా 9వ తరగతి, పదో తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రభుత్వం నాడు – నేడు పథకంలో పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిందని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు.

దోమతెరల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలను అందజేస్తున్న రెడ్‌క్రాస్ బృందం సభ్యులు

కురుపాం: మండలంలోని గిరిశిఖర గ్రామాలైన సిరికొండ, వాడకొయ్యి, పొక్కిరిగూడ తదితర గిరిజన గ్రామాల గిరిజనులకు సింగపూర్ నుంచి వచ్చిన రెడ్‌క్రాస్ బృందం సభ్యులు దుప్పట్లు, దోమతెరలు, వంట సామగ్రి గురువారం అందజేసారు. పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో వీటిని వితరణగా అందజేసారు. గిరిజనులకు వ్యక్తిగత ఆరోగ్య పరిశుభ్రతపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్.సన్యాసిరావు, రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పి.కొండలరావు, వై.జనార్దనరావు, కొత్తకోట లక్ష్మణరావు, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. కళాశాలలో జాతీయ సేవా శిబిరం (ఎన్ఎస్ఎస్) వన్ మరియు టూ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎల్విన్‌పేట సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు, స్థానిక యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. యువత సామాజిక బాధ్యత కలిగి స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావడం అభినందించదగ్గ విషయమంటూ ప్రిన్సిపాల్ కొనియాడారు. పార్వతీపురం బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కె.హరిజగన్, సిబ్బంది దాతల నుంచి 25 ప్యాకెట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డి.రామయ్య, బి.త్రినాథ్, అధ్యాపకులు, రిటైర్డ్ హెచ్‌ఎం జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.